బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి

కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు
- మిర్యాలగూడలో బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం

మిర్యాలగూడ, ఏప్రిల్ 22: జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాలను పట్టణంలో సోమవారం రెడ్డికాలనీలో గల పార్టీ కార్యాలయం వద్ద ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు వివరించి, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ప్రజలను ఓట్లను అభ్యర్థించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేరని అన్నారు. రైతులు, పేద ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓట్లు వేశామా అని బాధపడుతున్నారని అన్నారు. అలాగే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి సహకరించింది శూన్యమన్నారు. ప్రతిపక్షాలను ఈడీ, సీబీఐలతో అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులపాలు చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, దామరచర్ల జడ్పీటీసీ ఆంగోతు లలితహాతీరాం, అడవిదేవులపల్లి ఎంపీపీ బాలాజీనాయక్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, పార్టీ మాడ్గులపల్లి మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, నాయకులు ఖాజా మోయినుద్దిన్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, ఎండీ.షోయబ్, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, బచ్చు సాయన్న, సైదానాయక్, చీన్యానాయక్, కొండల్, రాజ్‌కుమార్, భిక్షం పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు : డీఈఓ

రామగిరి, ఏప్రిల్ 22 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు 2023-24 విద్యా సంవత్సరం మంగళవారంతో ముగుస్తుందని డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిందని వివరించారు. ఈసెలవుల్లో విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని పేర్కొన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే పాఠశాలలపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

మిర్యాలగూడ రూరల్ : గోగువారిగూడెం పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ శేషగిరిశర్మ

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఐలాపురం, చిల్లాపురం గోగువారిగూడెం, మైసమ్మకుంట తండా గ్రామాలకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లను ఎంపీడీఓ శేషగిరి శర్మ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో విద్యుత్ సరఫరా, తాగు నీరు, భద్రతకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లల్లో దివ్యాంగులు వచ్చి ఓటు వినియోగించేందుకు వీల్ చైర్ లోనికి వచ్చేందుకు కావాల్సిన డ్రాప్‌ల నిర్మాణం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈయన వెంట ఎంపీఓ పద్మ, పంచాయతీ కార్యదర్శి , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చందంపేటలో మూడు పోలింగ్ బూత్ ప్రతిపాదన

చందంపేట :మండలంలో కొత్తగా మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తాసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చందంపేట మండలం 43 పోలింగ్ బూత్‌లను పరిశీలించి పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని గువ్వలగుట్ట గ్రామపంచాయతీ పరిధిలోని నక్క దుబ్బతండా, పాత తెల్లేవర్‌పల్లి పరిధిలోని మోత్యతండా, ముడుదండ్ల గ్రామ పరిధిలోని బోడ బండ తండాల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కేవీకేలో స్వర్ణోత్సవ సంబురం

శ్రీనివాసరావుకు టార్చ్ ట్రీ అందజేస్తున్న రాజేంద్రనగర్ శాస్త్రవేత్త

త్రిపురారం, ఏప్రిల్ 22 : మండలంలోని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నుంచి ఈనెల 26 వరకు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాస్‌రావు తెలిపారు. దేశంలో మొట్టమొదటిసారి 1974లో పుదుచ్చేరిలో మొదటి కృషి విజ్ఞాన కేంద్రం స్థాపించడం జరిగిందని, ఇప్పుడు భారతదేశం మొత్తంలో 731 కేవీకేలు ఉన్నాయని అన్నారు. కేవీకే స్థాపించి 50 ఏళ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా స్వర్ణోత్సవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని రాజేందర్‌నగర్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కంపసాగర్ కేవీకేకు శాస్త్రవేత్తలు టార్చ్ చెట్టును అందించినట్లు తెలిపారు. స్వర్ణోత్సవాలకు రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలి

- పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాల్‌బహుదూర్ గౌడ్

మునుగోడు, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐతగోని లాల్‌బహుదూర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మునుగోడు ఎంపీపీ కర్నాటి స్వామి, పలువురు బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత స్వలాభం కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని పేర్కొన్నారు. కర్నాటి స్వామికి ఎంపీపీ పదవి బీఆర్ఎస్ పెట్టిన భిక్షనేనన్నారు. ఆయన తన ఎంపీపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

నేడు నీలగిరిలో వీరహనుమాన్ విజయయాత్ర

రామగిరి, ఏప్రిల్ 22 : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో 'వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ , బజరంగ్‌దళ్ నల్లగొండ జిల్లా నిర్వాహకులు వెల్లడించారు. నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మధ్యాహ్నం 3.15 గంటలకు నల్లగొండలోని పాతబస్తీ హనుమాన్ నగర్ అభయాంజనేయ ఆలయం నుంచి యాత్ర ప్రారంభమై వీటీకాలనీలోని పంచముఖ హనుమాన్ ఆలయం వరకు సాగుతుందన్నారు.

యాత్ర ప్రారంభోత్సవ ముఖ్య వక్తగా విశ్వ హిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యజీ, ముఖ్య అతిథిగా శ్రీసత్యజ్ఞాన ఆశ్రమ పీఠాధిపతి, తాడేపల్లి గుంటూరు జిల్లా ప్రణవానందభారతీ స్వామి హాజరవుతున్నట్లు వెల్లడించారు. అధిక సంఖ్యలో హిందూ బందువులు, ప్రజలు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

అమ్మనబోలు రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 22: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ అమ్మనబోలు రహదారిపై రైతులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆదివారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, వర్షానికి అమ్మనబోలు కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిందన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రాకపోవడంతో రైతన్నకు అపార నష్టం వాటిల్లిందన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధాన్యం ఆరబెట్టుకొని తీసుకురావాలని చెప్పడం ఆవిధంగా తెచ్చిన తర్వాత ఏదో ఒక సాకుతో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజులకు ఒకసారి లారీ లోడ్‌తో ఎగుమతి కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటుమని వివరించారు. రోజుకు 4 లారీలతో ఎగుమతి చేస్తే మాకు ఈ గతి పట్టేది కాదన్నారు. విషయాన్ని తెలుసుకున్న సివిల్ సప్లయ్ అధికారులు తడిసిన పంటను పరిశీలించారు.

రేపు,మాపు అంటూ నీటి పాటు చేశారు

పది రోజుల క్రితం వరి కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చా. నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారు. తేమ శాతం తక్కువగా ఉంది. రెండ్రోజులు ఆరబెట్టుకోమన్నారు. రోజుకు ఒక్క లారీ కూడా రావడం లేదు. రేపు మాపు అంటూ నా ధాన్యం నీటిపాలు చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. పంట నష్ట పోయిన వారికి న్యాయం చేయాలి.

-బాసాని శంకరయ్య, రైతు, అమ్మనబోలు

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం: డీఎస్ఓ వెంకటేశ్వర్లు

మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 22 : అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతామని, రైతులు అధైర్యపడవద్దని డీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 60 కేంద్రాల్లో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతుల ఖాతాల్లో రూ. 211 కోట్లు నగదు చెల్లించామన్నారు. అమ్మనబోలు సెంటర్ నుంచి రెండ్రోజుల్లో తడిసిన ధాన్యంతో సహా పూర్తిగా కొనుగోలు చేస్తాం. ఈ సమావేశంలో డీసీఎస్ఓ నాగేశ్వర్ రావు, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు ఇబ్బందులు లేవు

నీలగిరి : జిల్లాలో ఆదివారం కురిసిన అకాల వర్షాల వల్ల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవని డీఎస్ఓ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ హన్ సోమవారం వర్షంపై వివిధ జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను డీఎస్ఓ తెలిపారు. వర్షానికి జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు కలగలేదని, ప్రత్యేకించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, ఇతర ఏర్పాట్లు చేయడం వల్ల వర్షానికి ధాన్యం తడవకుండా రక్షించుకోగలిగామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 500 లారీలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు.

ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ నాగేశ్వర్‌రావు, జిల్లా కోపరేటివ్ అధికారి కిరణ్ కుమార్ , డీఏఓ శ్రవణ్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.

హాలియాలో గంగమ్మ పండుగ

హాలియా: గంపలతో ఆలయానికి వెళ్తున్న యాదవులు

హాలియా, ఏప్రిల్ 22 : హాలియాలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గంగాదేవి విగ్రహం లభించడంతో యాదవ సంఘ నాయకులుఆలయ నిర్మించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి అమ్మవారికి బోనం సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి గంప వెళ్లదీయడంతో పాటు గొర్రెపోతులను బలిచ్చి పండుగను జరుపుకున్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : కొత్తపల్లిలో మునగ తోటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 : అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, అకాల వర్షానికి నల్లగొండ మండలంలో కౌలు రైతు శ్రవణ్ మునగ తోట నేలమట్టం కావడంతో సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గంలో ఆకాల వర్షానికి నష్టపోయిన పంటలను అధికారులు అంచానా వేసి తక్షణమే నష్టపరిహారం అందజేయాలని కోరారు. నిమ్మ ,బత్తాయి ,మామిడి రైతులు జిల్లాలోఎక్కువగా ఉన్నారని, ఇప్పటి వరకు నష్టపోయిన రైతులను కనీసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జరిగిన నష్టానికి స్పందించక పోవడం చాల బాధకరమన్నారు. ఆయన వెంట కల్వకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రొమ్ముల నాగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌కే. లతీఫ్, ముక్కాముల వెంకన్న, పోలోజు వెంకటాచారి, అల్గుబెల్లి సైదిరెడ్డి, యరమాద శంకర్‌రెడ్డి, కట్టా శ్రీనివాస్ ఉన్నారు.

కేసీఆర్‌పై కోమటిరెడ్డి బ్రదర్స్ ఆరోపణలు తగవు

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 : భువనగిరి సభలో మాజీ సీఎం కేసీఆర్ , మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ అసత్య ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపించిన జగదీశ్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు చామకూరి లింగస్వామి గౌడ్, కోటేశ్, విశాల్ రెడ్డి, నిరంజన్, శంకర్, లింగస్వామి, రవి, రమేశ్, సురేశ్ ,సైదులు పాల్గొన్నారు.

పలువురి మృతదేహాలకు ఎమ్మెల్యే బాలూనాయక్ నివాళి

దేవరకొండ(చందంపేట)/మాల్, ఏప్రిల్ 21: దేవరకొండ పట్టణానికి చెందిన సంధ్య టెక్స్‌టైల్ నిర్వాహకురాలు పంచాక్షరి, చింతపల్లి మండలం గొడకొండ్ల(మాల్)కు చెందిన వూరె శ్రీహరి, ఐతగోని నర్సింహ ఆదివారం మృతి చెందారు. సోమవారం వారి మృతదేహాలను ఎమ్మెల్యే బాలూనాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ కొండూరి భవానీప వన్‌కుమార్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, అంగిరేకుల గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ముక్కమల వెంకటయ్య, శిరందాసు కృష్ణయ్య ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పరామర్శ

దేవరకొండరూరల్ /దేవరకొండ (చందంపేట) ఏప్రిల్ 22 : మండలంలో జిల్లేపల్లి గ్రామానికి చెందిన దేప పరశురాంరెడ్డి, రవీంద్రనాయక్‌తండాకు చెందిన డేబ మృత దేహాలకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రవీంద్రకుమార్, వెంట వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్, నాగవరం ప్రభాకర్‌రావు, గాజుల రాజేశ్, వేముల రాజు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ, ఏప్రిల్ 22: మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై యువకుడి మృతదేహం కనిపించడంతో అతడి దుస్తుల్లో ఉన్న ఐడీ కార్డులతో అడ్రెస్‌ను గుర్తించాం. గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామానికి చెందిన గుగులోతు విజయ్(21)గా గుర్తించారు. తన ఆత్మహత్యకు కారణం ఎవరూ కారని, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లెటర్ రాసి ఉంచాడు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మేకల భిక్షం

చిట్యాల, ఏప్రిల్ 22 : చిట్యాలకు చెందిన మేకల భిక్షం అనే వ్యక్తి కనిపించడం లేదని ఎస్ఐ సైదాబాబు తెలిపారు. భిక్షం ఈ నెల 21 సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని, అతడి కోసం పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆయన కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు. ఆచూకీ తెలిసిన వారు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

భద్రత పథకంతో పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా

- ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి,ఏప్రిల్ 22. ప్రజలకు రక్షణగా పని చేస్తున్న పోలీసుల కుటుంబాలకు భద్రత పథకం ఆర్థిక భరోసా లభిస్తుందని ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏహెచ్‌టీయూ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటులో మృతి చెందిన కానిస్టేబుల్ ఎస్‌కే నజీర్ కుటుంబానికి రూ.8 లక్షల భద్రత చెక్‌ను ఆమె అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చనిపోయిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ధి సాధ్యమైనంత త్వరగా అందేలా కృషి చేస్తానని అన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ సబిత, జూనియర్ అసిస్టెంట్ ప్రమోద పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠాకు రిమాండ్

- ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు స్వాధీనం

కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కట్టంగూర్, ఏప్రిల్ 22 : బస్సుల్లో బంగారు ఆభరణాలను చోరీకి పాల్పడుతున్న ముఠాను కట్టంగూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శాలిగౌరారం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నకిరేకల్ పట్టణానికి చెందిన వృద్ధ దంపతులు మోత్కూరి లక్ష్మయ్య, లక్ష్మమ్మ 20 తులాల ఆభరణాలను బ్యాగులో పెట్టుకొని 23 జనవరి 2024న నకిరేకల్ నుంచి హైదరాబాద్‌కు కూతురు వద్దకు ఆర్టీసీ బస్సులో బయల్దేరారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన సంపంగి తిరుపతమ్మ, సంపంగి యాదగిరి,ఓర్సు కవిత(తల్లి, కొడుకు, కోడలు) కలిసి బస్సుల్లో బ్యాగులు చోరీకి పాల్పడుతుంటారు. ఈ క్రమంలో నకిరేకల్‌లో ఎక్కిన లక్ష్మయ్య, లక్ష్మమ్మ బ్యాగును గుర్తించిన ముగ్గురు మార్గమధ్యంలో అయిటిపాములకు రాగానే దంపతుల వద్ద ఉన్న బ్యాగును అపహరించారు. హైదరాబాద్‌కు వెళ్లిన దంపతులు కుటుంబ సభ్యుల సహకారంతో 27 జనవరి 2024న కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం కట్టంగూర్‌లోని నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో నిందితులు లారీ దిగి అనుమానాస్పదంగా వెళ్తుండగా గమనించిన పోలీసులు విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.5వే ల నగదు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిపై గతంలో మిర్యాలగూడ, హాలియా పోలీస్‌స్టేషన్లతో పాటు ఖమ్మం జిల్లాలో చోరీ కేసులున్నాయని సీఐ తెలిపారు. ఈ కేసును చేధించిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ శ్రీను. ఏఎస్ఐ అప్జల్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణు ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ ఎన్.శ్రీను, సిబ్బంది వెంకన్న, రామలింగయ్య, సైదులు, రాంమోహన్, సతీశ్, గౌతమి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

లచ్చు (ఫైల్)

మహేందర్ (ఫైల్)

పెద్దవూర, ఏప్రిల్ 22 : ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన పెద్దవూర మండల కేంద్రంలోని విశ్వనాథ స్పిన్నింగ్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం పంగవాని కుంట గ్రామానికి చెందిన నీలం మహేందర్(21) పల్సర్ బైక్‌పై ఉదయం 11గంటలకు బయల్దేరి గుర్రంపోడ్ మండలం కొప్పోల్‌లో బంధువుల ఇంటికి వెళ్లి పని ముగించుకొని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి 10గంటల సమయంలో పెద్దవూర మండల శివారులోని విశ్వనాథ స్పిన్నింగ్ మిల్ సమీపంలోకి రాగా అదే సమయంలో పెద్దవూర వైపు నుంచి కొండమల్లేపల్లి వైపు వెళ్తోన్న నేనావత్ లచ్చు (35) ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌కు బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మహేందర్ అక్కడికక్కడే మృతి చెందగా లచ్చును చికిత్స నిమిత్తం నాగార్జున సాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధ రాత్రి మృతి చెందాడు. మహేందర్‌కు వివాహం కాలేదు లచ్చుకు భార్య మంజులతో పాటు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. మహేందర్ అన్న భిక్షం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వీరాబాబు చెప్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

దామరచర్ల : గుర్తుతెలియని వాహనం ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. వాడపల్లి ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా గ్రామానికి చెందిన దేవనబోయిన కృష్ణయ్య(55) డీసీఎం టైరు పంచర్ చేయించుకొని తిరిగి వెళ్లే క్రమంలో డీసీఎం పక్కనే ఉన్న అతడిని మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో కృష్ణయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వాడపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం కోసం మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం ఆరా తీస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరొకరు..

కట్టంగూర్ : బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఘటన మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ ఎన్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. కురుమర్తి గ్రామానికి చెందిన చల్ల భిక్షం(51)బైక్‌పై నకిరేకల్‌లో బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో అయిటిపాముల గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి.

చికిత్స కోసం నార్కట్‌పల్లి కామినేని దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సోమవారం మ